క్లుప్తంగా

కార్మెల్ మాతకు వందనం



ఫిరంగిపురం: కార్మెల్ కొండపై వెలసిన కార్మెల్ మాతను దర్శించుకునేందుకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం తరలివచ్చారు. ఉదయాన్నే బాల ఏసు దేవాలయంలో నిర్వహించే దివ్యపూజాబలిలో పాల్గొన్నారు. బాల ఏసును భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. అనంతరం కొండను ఎక్కి కార్మెల్ మాతకు తలనీలాలు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్కే రూ.2 లక్షల సాయం



మంగళగిరి: నగరంలోని పాత మంగళగిరి అంజుమన్ శ్మశాన వాటిక వద్ద నిర్మితమవుతున్న మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మేరకు ఆదివారం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మైనార్టీ నాయకులు ఎండీ ఇక్బాల్ అహ్మద్, ఎండీ ఫిరోజ్, పఠాన్ అఫ్రఖాన్ చేతుల మీదుగా అంజుమన్ సంస్థ ప్రతినిధులకు ఆ మొత్తాన్ని అందజేశారు. మసీదు నిర్మాణానికి సహకరించి రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని అందించిన ఎమ్మెల్యే ఆర్కేకు అంజుమన్ సంస్థ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

కోల్డ్ స్టోరేజ్ ప్రారంభం

మేడికొండూరు: మేడికొండూరు ఈద్గా ఎదురు జైకిసాన్ కొత్త కోల్డ్ స్టోరేజ్‌ని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జై కిసాన్ కోల్డ్ స్టోరేజ్ యజమానులు పాలు పద్ద సాంబశివరావు, పాములపాటి రామకృష్ణ, పాములపాటి జయలక్ష్మి సీపీఎం నాయకులు నేతాజీ, బి.శ్రీనివాసరావు, పార్టీ మేడికొండూరు మండల కార్యదర్శి బొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేళాంగిణి మేరీమాత స్థూప ఆవిష్కరణ



బండారుపల్లి(తాడికొండ): బండారుపల్లి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన వేళాంగిణి మేరీమాత స్థూప ఆవిష్కరణ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ సర్పంచ్ ముప్పాళ్ళ మనోహర్ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో వర్క్‌షాప్



తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఆదివారం కొత్త ఆవిష్కర్తల కోసం ఒక్క రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు యూనివర్సిటీ పరిశోధన అభివృద్ధి విభాగ అధిపతి జై కుమార్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీఐసీ కేఎల్ స్టార్టప్‌ల ఫౌండేషన్, కేఎల్ ఐపీఎస్‌ల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని, ఏసీఐసీ సీఈఓ గోవిల్ అలోక్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులతో ఆయన అనుభవాలను పంచుకున్నారని వివరించారు. కేంద్ర పరిశ్రమల స్థాపన శాఖ అధికారి సతీష్‌కుమార్ మార్కెట్ ప్రవేశ వ్యూహాలలో పోటీ ప్రయోజనాలను వివరించారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, పరిశోధకులు ఎం.సాయి కిరణ్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవం నమోదు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాల వేదికగా ఈనెల 11,12 తేదీల్లో నిర్వహిస్తున్న గుంటూరు జిల్లా బాలోత్సవ నమోదు గడువును పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు పొడిగించినట్లు అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23 అంశాల్లో నిర్వహిస్తున్న బాలోత్సవ్‌లో 4,5,6,7 తరగతుల విద్యార్థులకు జూనియర్, 8,9,10 తరగతులకు సీనియర్ విభాగాల్లో నిర్వహించే పోటీలకు శనివారం ముగిసిన గడువును ఈనెల 10వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుం లేకుండా పోటీల్లో పాల్గొనేందుకు 97035 79996 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

ఓం శాంతి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలో పద్మశాలి బజారులోని శ్రీశ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామివార్ల శాంతి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు శాంతి హోమం, శ్రీ స్వామికి దివ్య తిరుమంజనోత్సవం, మధ్యాహ్నం, సాయంతం శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. 6,7 తేదీల్లో కూడా శ్రీ భద్రావతి సమేత భావనారుషి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకస్వామి ఆనందాచార్యులు తెలిపారు.

మాఘ పున్నమి వెన్నెల

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం హయగ్రీవ హోమం, అష్టోత్తర పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై హయగ్రీవ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

తల్లీ.. కటాక్షించండీ



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



శతచండీ యాగం చేస్తున్న దంపతులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి గ్రామంలో ఆదివారం గురూజీ అమృతానందం శిష్యుల ఆధ్వర్యంలో మహా శత చండీ యాగం నిర్వహించారు. సీతానగరానికి చెందిన కనకదుర్గ ఆలయ దత్తత దేవస్థానమైన శ్రీ కోదండ రామ సమేత వీరాంజనేయస్వామి గుడి భూముల్లో ఈ యాగం జరిగింది. కార్యక్రమంలో ముందుగా గణపతి హోమం నిర్వహించారు. పండితులు రాండారు సుందర లక్ష్మి శ్రీదేవి ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఈ మహా చండీయాగం నిర్వహించారు. కార్యక్రమంలో 13 రకాల హోమ కార్యక్రమాలు నిర్వహించగా ఉండవల్లి చుట్టుపక్కల ప్రాంత్రాల్లోని 100 మందిపైగా దంపతులు పాల్గొన్నారు.

గోపయ్య సమేత తిరుపతమ్మ కల్యాణోత్సవం



విశేష అలంకారంలో గోపయ్య, తిరుపతమ్మ

ఫిరంగిపురం: గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ 21వ వార్షిక కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు పూర్ణనాగసాయిచారి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అష్టోత్తర, సహస్రనామాలతో పుష్పార్చన చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగశాలలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహించి ఉత్సవమూర్తులకు కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం ఆలయ ముఖమండపంలో గోపయ్య సమేత తిరుపతమ్మ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రెండువేల మంది భక్తులకు శ్రీలక్ష్మీతిరుపతమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమాలను టి.గోవిందు పర్యవేక్షించారు.

ఉద్యోగ విరమణ సహజం



ఆత్మకూరి వెంకటప్పయ్య దంపతులను గజమాలతో సత్కరిస్తున్న పోస్టల్ శాఖ ఉద్యోగులు

మంగళగిరి: ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో సహజమని విజయవాడ పోస్టాఫీస్ అసిస్టెంట్ డైరెక్టర్ సర్కిల్ ఎంహెచ్‌పీ హరి ప్రసాద్ శర్మ చెప్పారు. నగరంలోని హెడ్ పోస్టాఫీస్ కార్యాలయంలో ఆదివారం పోస్టల్ శాఖ ఉద్యోగి ఆత్మకూరి వెంకటప్పయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన సభ జరిగింది. పోస్ట్ మాస్టర్ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడ పోస్టాఫీస్ అసిస్టెంట్ డైరెక్టర్ సర్కిల్ హరిప్రసాద్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వెంకటప్పయ్య 39 ఏళ్లపాటు తపాలా శాఖలో వివిధ పదవుల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి అత్యుత్తమ సేవలు అందించారని కొనియాడారు. మంగళగిరి బ్రాంచ్ పోస్టల్ యూనియన్ సభ్యునిగానూ, రాష్ట్ర సంఘ కోశాధికారిగా విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వెంకటప్పయ్య దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ ప్రతినిధులు వి.మోహన్‌రావు, డీఎల్ కాంతారావు, రామకృష్ణ, జి.రమేష్, ఏపీ ఆర్యవైశ్య కార్యదర్శి మాజేటి వేణుగోపాలరావుతో పాటు పలువురు బ్రాంచ్ సపోర్టు మాస్టర్లు పాల్గొన్నారు.

క్రీస్తు కృపాలయం ప్రతిష్ఠ ఆరాధన పండుగ



ప్రతిష్ఠ ఆరాధన పండుగ సందర్భంగా చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రీస్తు భక్తులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్‌పేటలోని క్రీస్తు కృపాలయం ప్రతిష్ఠ ఆరాధన పండుగ ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాత చర్చిని తొలగించి కొత్త చర్చి నిర్మాణం చేపట్టి 21 ఏళ్లు పూర్తి కావడంతో ప్రతిష్ఠ ఆరాధన కూడికలను నిర్వహించినట్లు పాస్టర్లు రవిప్రసాద్, దానియేల్‌రాజు తెలిపారు. ప్రతిష్ఠ ఆరాధన సందర్భంగా ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి వార్షికోత్సవం సందర్భంగా కమిటీ వారు పాత చర్చి నిర్మాణం, కొత్త చర్చి నిర్మాణాలు ఎలా ఉన్నాయనే నమూనాను తయారు చేసి చర్చి ఆవరణలో ఏర్పాటు చేశారు. చర్చికి వచ్చిన ప్రతిఒక్కరూ ఆ రెండింటిని పరిశీలించి చర్చి కమిటీ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. 21వ వార్షికోత్స సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించారు.

రెల్లి సంక్షేమ సంఘం కొత్త కార్యవర్గం



కార్యవర్గ సభ్యులకు నియామకపు పత్రాలను అందజేస్తున్న సంఘ రాష్ట్ర అధ్యక్షులు నీలాపు వెంకటేశ్వరరావు

మంగళగిరి: రెల్లి కులాల సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షునిగా బండి దశరథరావు ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని బాపనయ్య నగర్‌లో సంఘం కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు నీలాపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పట్టణ రెల్లి కులాల సంక్షేమ సంఘం కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా తుపాకుల రమణమ్మ, యలమంచిలి సామ్రాజ్యం, సంఘం పట్టణ అధ్యక్షునిగా బండి దశరథరావు, ఉపాధ్యక్షులుగా యర్రంశెట్టి నాగమల్లేశ్వరరావు, కార్యదర్శిగా యర్రంశెట్టి సాయికుమార్, సహాయ కార్యదర్శిగా ఎం.శరత్ బాబు, కోశాధికారిగా కొమ్మర అప్పారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముత్యాల వాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కొత్త కార్యవర్గ సభ్యులకు రాష్ట్ర అధ్యక్షులు నీలాపు వెంకటేశ్వరరావు నియామకపు ఉత్తర్వుల కాపీలను అందజేశారు.

పరీక్షలంటే భయాన్ని వీడాలి

విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ



కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మీనారాయణ, స్కూల్ డైరెక్టర్లు

పాత గుంటూరు: విద్యార్థులంతా పరీక్షలంటే భయాన్ని వీడాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి వి.వి. లక్ష్మీనారాయణ సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా పరీక్షల్లో వచ్చే ప్రశ్నలను ముందే గ్రహిస్తే సునాయాసంగా రాయవచ్చని తెలిపారు. ఆదివారం రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, జూనియర్ రెడ్ క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో పరీక్షా పే చర్చా కార్యక్రమం నిర్వహించారు. సభకు రెడ్ క్రాస్ యూత్ కో–ఆర్డినేటర్ ఎస్.వి.ఎస్.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా వి.వి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సూర్యాస్తమయానికి ముందు భోజనం చేసి, సూర్యోదయానికి ముందు నిద్రలేస్తే విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటారని పేర్కొన్నారు. పరీక్షలు అయిపోయే వరకు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి. రామచంద్రరాజు, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర నేత మేకల రేవీంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి శ్రీహరి, నాయకులు వంగా శ్రీనివాసరావు, ఎ.సురేష్, మల్లికార్జునరావు, నర్రా రాజేష్, బత్తిన వెంకట్రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏఎంఎంఎస్ పరీక్షలు

తెనాలిఅర్బన్: ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షను ఆదివారం పట్టణంలోని ఐదు మున్సిపల్ పాఠశాలలో నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరిగాయి. తెనాలి డివిజన్ పరిధిలో ఎనిమిదోవ తరగతి చదువుతున్న 930 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 870 మంది పరీక్షకు హాజరైనట్లు డెప్యూటీ డీఈవో జి.నిర్మల తెలిపారు. తెనాలి పట్టణంలోని బాయ్స్ హైస్కూల్, గరల్స్ హైస్కూల్, ఎన్‌సీఆర్ స్కూల్, టీఎస్ఆర్ స్కూల్, కెఎస్ఎం స్కూల్లో పరీక్షలు నిర్వహించినట్లు ఆమె చెప్పారు. రూట్ ఆఫీసర్ ఎం.లక్ష్మీనారాయణ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఆటో, 19 బస్తాల బియ్యం స్వాధీనం

తాడికొండ: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తుళ్ళూరు సీఐ ఆనందరావు తెలిపారు. ఆదివారం ఉదయం ఏడు గంటల సమయంలో తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామం శివారు కర్లపూడి మార్గంలో కొత్త బ్రిడ్జి ఏరియాలో నిఘా ఏర్పాటు చేయగా ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. ఎస్ఐ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడులలో 35 కిలోల బరువున్న 19 బస్తాల బియ్యంతో పాటు వాటిని తరలిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ ఆనందరావు తెలిపారు. పట్టుబడిన బియ్యం సుమారు ఆరున్నర క్వింటాళ్లు ఉంటుందని ఆయన తెలిపారు.

దివ్యాంగులను ఆదరిద్దాం



దివ్యాంగ వృద్ధుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న ముంతాజ్ బేగం

తాళ్ళాయపాలెం(తాడికొండ): అంగవైకల్యం ఉన్న వారిని చులకనగా చూడకుండా ఆదరించడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించవచ్చని వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ బేగం చెప్పారు. ఆదివారం తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఐనవోలు సుధీర్ ఆధ్వర్యంలో అంగవైకల్యం ఉన్న వృద్ధుడికి ట్రైసైకిల్ పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వికలాంగులకు చేయూత అందించేందుకు యువత ముందుకు రావడం హర్షణీయమని కొనియాడారు.

బీసీ హాస్టల్ విద్యార్థికి అస్వస్థత

ఫిరంగిపురం: తూర్పు బజారులోని బీసీ హాస్టల్‌లో ఉంటున్న పదో తరగతి విద్యార్థి భోజనం చేసిన తరువాత అస్వస్థతకు గురైన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. బీసీ హాస్టల్‌లో ఉంటూ పదోతరగతి చదువుతున్న నరేంద్ర అనే విద్యార్థి రాత్రి భోజనం చేసిన తరువాత తలనొప్పిగా ఉందంటూ స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వరరావు, వాచ్‌మెన్ కుమార్, కమాటీ అశోక్ విద్యార్థిని స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించి 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉందని, లేచి మాట్లాడుతున్నాడని వార్డెన్ తెలిపారు. వారి తల్లిదండ్రులకు కబురు పంపామని, వైద్యశాలకు వచ్చారని చెప్పారు.

మానవ హక్కుల కమిషన్ సభ్యుడు శ్రీనివాస్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఏఎన్‌యూ లా విభాగ పూర్వ విద్యార్థులు

ఏఎన్‌యూ: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుడు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగ పూర్వ విద్యార్థి డాక్టర్ గోచిపాత శ్రీనివాస్‌ను లా విభాగ పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. యూనివర్సిటీలో ఆదివారం జరిగిన ఏఎన్‌యూ లా పూర్వ విద్యార్థుల సమావేశంలో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస్‌కు పూర్వ విద్యార్థులైన ఆయన మిత్రులు ఈ ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ సహచరుడు, లా విభాగ పూర్వ విద్యార్థి రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన పదవిలో ఉండటం అభినందనీయమని తెలిపారు. యూనివర్సిటీ సమీపంలోని నంబూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన కోసం కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి, లా విభాగ పూర్వ విద్యార్థులు, డాక్టర్ చందు పాల్గొన్నారు.

డైయింగ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న డైయింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎంఎల్ నరసింహారావు

మంగళగిరి: నగర పరిధి ఆత్మకూరు డైయింగ్ సెంటర్‌లో ది హ్యాండ్ లూమ్ కలర్ ప్రింటింగ్ అండ్ యారన్ డైయింగ్ వర్కర్స్ యూనియన్ 50వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా ఎం.పకీరయ్య, అధ్యక్షునిగా ఎంఎల్ నరసింహారావు, ఉపాధ్యక్షులుగా రుద్రు ఉమామహేశ్వరరావు, గండా బత్తుల నాగేశ్వరరావు, దొంతా బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా కట్టా కృష్ణ, సహాయ కార్యదర్శులుగా ఎస్.సుధాకర్, జె.సహదేవుడు, ఎస్.శ్రీనివాసరావు, కోశాధికారిగా డి.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన సభలో అధ్యక్షులు ఎం.ఎల్.నరసింహారావు మాట్లాడుతూ డైయింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. అనంతరం కొత్త కార్యవర్గ సభ్యులను పలువురు డైయింగ్ కార్మికులు కలిసి అభినందనలు తెలిపారు.

ఇతర ప్రాంతాల పోలీసుల అత్యుత్సాహం

- స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నిందితులను తీసుకెళ్తున్న వైనం
- బంధువుల ఫిర్యాదులతో తాడేపల్లి పోలీసులకు తలనొప్పి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులు అత్యుత్సాహం చూపించడంతో ఏం జరుగుతుందో అర్థం కాక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వివిధ నేరాల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులను ఇతర ప్రాంతాల పోలీసులు ప్రైవేటు వాహనాల్లో వచ్చి స్థానిక పోలీసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఎక్కించుకుని వెళ్లడంతో బంధువులతోపాటు ఇతరులు కూడా ఆందోళన చెందుతున్నారు. తాజాగా ఒంగోలు పోలీసులు ఆదివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వకుండా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని వెళ్లిపోయారు. దీంతో తొలుత కిడ్నాప్ జరిగిందంటూ స్థానిక ప్రజలతోపాటు ఆ వ్యక్తి బంధువులు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు యువకుడిని తీసుకు వెళ్లిన వాహనాన్ని గుర్తించి వివరాలు సేకరించారు. ఒంగోలులో జరిగిన ఒక భూవివాదంలో ఆ యువకుడిని ఒంగోలు పోలీసులు తీసుకు వెళ్లారని నిర్ధారణ కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా నాలుగు రోజుల క్రితం కుంచనపల్లికి చెందిన ఓ యువకుడు ప్రాతూరు రోడ్డులో ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రైవేటు వాహనంలో వచ్చిన హైదరాబాద్ పోలీసులు ఆ యువకుడి ద్విచక్రవాహనాన్ని అడ్డుకుని స్కార్పియో కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారు. ఆ యువకుడి బండిని ప్రాతూరు అండర్‌పాస్ వద్ద పార్కింగ్ చేశారు. యువకుడి బంధువులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో శనివారం ఆ యువకుడిని మత్తుపదార్థాల విషయంలో విచారణ కోసం హైదరాబాద్ క్రైం పోలీసులు తీసుకు వెళ్లారని నిర్ధారణ అయింది. తాడేపల్లిలో నెలలో నాలుగైదు సార్లు ఇతర ప్రాంతాల నుంచి పోలీసులు వచ్చి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నిందితులను తీసుకెళ్తున్నారని సమాచారం. ఇది తాడేపల్లి పోలీసులకు తలనొప్పిగా మారుతోంది.

తెలుగు ధిక్కార కవులు కలేకూరి, మద్దూరి, పైడి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

పాత గుంటూరు: తెలుగు సాహిత్యంలో ధిక్కార కవులుగా కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్ బాబు చరిత్రలో నిలిచిపోయారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని ఒక హోటల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ ఆధ్వర్యంలో కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్ బాబు దళిత బహుజన తత్వం అంశంపై ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమం ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్‌బాబు దళిత అస్తిత్వాన్ని తెలుగు సాహిత్యంలో బలంగా వినిపించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో విరసం నాయకులు సి.ఎస్.ఆర్. ప్రసాద్, కవులు ఎఫ్.ఎం.సుభాని, చంద్రపాల్, శ్యాం బాబు, కడియం జేమ్స్, బండారు సురేష్ బాబు, న్యాయవాది సంజీవరెడ్డి మార్పుల పాల్గొన్నారు.

లిక్విడ్ గంజాయి కేసులో పాత నేరస్తుడి అరెస్టు



నిందితుడు మస్తాన్‌వలితో సీఐ రమేష్, సిబ్బంది

నగరంపాలెం: లిక్విడ్ గంజాయి కేసులో మరొకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ గుంటూరు–2 స్టేషన్ సీఐ ఎం.రమేష్ ఆదివారం తెలిపారు. ఈనెల 1న ఎస్ఈబీ గుంటూరు–2, డీఎస్ఈఓ బృంద పోలీసులు గుంటూరు క్లబ్ వద్ద వాహన తనిఖీలు చేశారు. ఈ క్రమంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరిలో ఒకరిని అరెస్టు చేసి, రూ.1.40 లక్షల లిక్విడ్ గంజాయితో పాటు మోటారు సైకిల్‌ను సీజ్ చేశారు. పరారైన మారుతీనగర్‌కు చెందిన తాజుద్దీన్‌తోపాటు అదే ప్రాంతానికి చెందిన శివప్రసాద్‌ను అరెస్టు చేశారు. ఇదే కేసులో మరో కీలకమైన నేతాజీనగర్ ఎనిమిదో వీధికి చెందిన షేక్ మస్తాన్‌వలి అలియాస్ బుడ్డాయ్‌ని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు. అతని నుంచి అరవై గ్రాముల లిక్విడ్ గంజాయి డబ్బాలు ఐదింటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నర్సీపట్నం లోతుగట్టు జంక్షన్ వద్దకెళ్లి గంజాయి తీసుకొచ్చి తాగుతూ, విక్రయించేవాడని దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. పెయింటింగ్ పనులకు వెళ్లే అతనిపై పట్టాభిపురం పీఎస్‌లో రెండు కేసులు నమోదైనట్లు ఆయన చెప్పారు.